క్లుప్తంగా

ఢిల్లీ ధర్నాలో ఎమ్మెల్యే బూచేపల్లి


జిల్లా నేతలతో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: ఏపీలో 51 రోజుల్లో 31 హత్యలు, 300పైగా హత్యాయత్నాలు, టీడీపీ నేతల వేదింపులతో 35 మంది ఆత్మహత్యలు, 4500 చోట్ల ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, 490 ప్రభుత్వ ఆస్తులు విధ్వంసం, రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా చేస్తున్న దాడులను జాతీయ స్థాయిలో తెలియజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం జరిగిన ధర్నాలో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరయ్యారు. నల్ల బ్యాడ్జిలతో తమ నిరసన తెలిపారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి దర్శి నియోజకవర్గంలో జరిగిన ఘటనల గురించి వివరించారు.

వలంటీర్లకు జీతాలు ఇవ్వాలి

మద్దిపాడు: వలంటీర్లకు జూన్‌నెల జీతాలు ఇవ్వలేదని వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పించారు. వలంటీర్ల గౌరవ వేతనాల విషయమై గ్రామ కార్యదర్శిని ప్రశ్నించగా మాకు తెలియదంటూ చెప్పారని, దీనిపై ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయమై సీఈఓను కలిసి మరో వినతి పత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన

దొనకొండ: రైతులకు పండ్ల తోట పెంపకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ, అగ్రికల్చర్ అధికారి ఆర్.రమేష్, డూమా కోర్స్ డైరెక్టర్ శ్యాంసన్ పాల్గొని మాట్లాడారు.


జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘాల నేతలు


నివాళులర్పిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఉసురుపాటి బ్రహ్మయ్య

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా

● నివాళులర్పించిన పలు సంఘాల నాయకులు

ఒంగోలు అర్బన్: విశ్వకవి గుర్రం జాషువా ఆదర్శప్రాయుడని పలు సంఘాల నాయకులు కీర్తించారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ప్రకాశంభవనం ప్రాంగణంలోని గుర్రం జాషువా విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీఎంఈఫ్, ఎంజేఎఫ్ వాటి అనుబంధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపేందుకు జాషువా చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. జాషువా 36 గ్రంథాలను రచించారని, వాటిలో గబ్బిలం, పిరదౌసి బాపూజీ వంటి రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. జాషువా ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాషువా సాహిత్య సమితి సభ్యులతో పాటు పలు సంఘాల నాయకులు ఎం డ్లూరి రవికుమార్, కత్తి కళ్యాణ్, అంగలకుర్తి ప్రసాద్, గద్దల విల్సన్, ముప్పవరపు గోపి, బాబా, అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. తోరటి అనంద, నేలపాటి రాజు, బుడుగుంట్ల లక్ష్మీనరసయ్య, నరసింగరావు, తిరువీధి బాబు, తమ్మిరి కిషోర్, గురిజాల బాబురావు, పూనూరి కృష్ణాఫర్, రావానూతల కోటయ్య, సింహాద్రి జైరావు పాల్గొన్నారు.


గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాటిబండ్ల గంగయ్య

గుర్రం జాషువాకు నివాళులు

చీమకుర్తి: నవయుగ కవి చక్రవర్తిగా పేరొందిన గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం చీమకుర్తి క్రిష్టియన్‌పాలెంలో స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. జాషువా రచనలు, సామాజిక చైతన్యానికి దోహదపడిన విధానాలను గుర్తు చేసుకున్నారు. వైఎస్ భారతి సేవా సమితి అధ్యక్షుడు పాటిబండ్ల రాజసులోచన, స్థానికులు పాల్గొన్నారు.

అహరోన్‌రావు ఆదర్శప్రాయుడు

ఒంగోలు సెంట్రల్: డిప్యూటీ డీఈఓగా పనిచేస్తూ మృతి చెందిన అహరోనురావు అందరికీ ఆదర్శప్రాయుడని వక్తలు అన్నారు. రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు పి.మధుసూధనరావు అధ్యక్షతన మృతి చెందిన డిప్యూటీ డీఈఓకి ఘన నివాళులర్పించారు. స్వరూప్, నరసింహం, బీవీ సుబ్బారావు, రత్నం, నెహేమ్యా తదితరులు పాల్గొని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

కంచే శ్మశానాన్ని మేసింది


మద్దిపాడులో శ్మశానాన్ని ఆక్రమించి జామాయిల్ సాగు చేస్తున్న దృశ్యం

మద్దిపాడు: కంచే శ్మశానాన్ని మేసింది. వీఆర్ఏ ఒకరు తమ గ్రామ పరిధిలోని శ్మశానాన్ని ఆక్రమించి జామాయిల్ తోట వేసి అక్రమంగా సాగు చేస్తున్నాడు. మద్దిపాడు వీఆర్ఏ గత సంవత్సరం నుండి శ్మశానం ఆక్రమించి జామాయిల్ తోట వేసి పెంచుతున్న విషయం తెలుసుకున్న విలేకరులు ఉన్నతాధికారుల దృష్టికి 15 రోజుల క్రితం తీసుకెళ్లారు. అయినా ఎటువంటి చర్యలు లేకుండా పోయాయి. ఈక్రమంలో మళ్లీ బుధవారం శ్మశానం పరిశీలించగా జామాయిల్ తోట అలాగే ఉండడంతో వీఆర్ఓను ప్రశ్నించగా ఆయన వీఆర్ఏకి ఫోన్ చేసి జామాయిల్ తొలగించమని చెప్పినా ఎందుకు తీసి వేయడంలేదని ప్రశ్నించగా తాను ఇక్కడ జామాయిల్ తోట వేయడానికి షుమారుగా రూ.2 లక్షలు ఖర్చయ్యాయని ఆ డబ్బు ఎవరు ఇస్తారంటూ ఎదురు ప్రశ్నించడం గమనార్హం. గతంలో ఇక్కడ పని చేసిన తహశీల్దార్ తనను జామాయిల్ తోట వేసుకోమని చెప్పారనడం కొసమెరుపు.

అద్భుతంగా శంకర విజయం నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వారి చాతుర్మాస దీక్ష సందర్భంగా కంచి లోని ఓరిక్కిమణి మండపంలో బుధవారం రాత్రి స్వామి వారి సమక్షంలో ఒంగోలుకు చెందిన నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన శంకర విజయం నృత్య రూపకం భక్తులను విశేషంగా అలరించింది. ఎస్వీ శివకుమారి దీనికి నృత్య దర్శకత్వం వహించారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహిత్యవేత నెమ్మాని సీతారామమూర్తి రచించారు. కేరళ రాష్ట్రంలోని కాలడి గ్రామంలో శంకరాచార్య వారి జన్మించినది మొదలు సర్వజ్ఞ పీఠం అధిష్టించిన దాకా వివిధ ఘట్టాలను నృత్య రూపకంగా 50 మంది కళాకారులు ప్రదర్శించారు. అద్భుతమైన డిజిటల్ స్క్రీన్‌తో, పాత్రలకు తగిన ఆహార్యంతో, నృత్యంతో యువతీ యువకులు ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను చేశారు. నృత్య ప్రదర్శన తిలకించిన పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి కళాకారులను ఆశీర్వదించారు. గూడా రామ్మోహన్‌రావు, విజయ లక్ష్మి సౌజన్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.


శంకర విజయం నృత్య ప్రదర్శనలో నళినీ ప్రియా విద్యార్థులు

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ కొడుతున్న నగర పంచాయతీ సిబ్బంది

దర్శి: పట్టణంలోని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మోటార్ సైకిల్‌పై ఫాగింగ్ యంత్రాలతో వీధి వీధిలో తిరిగి ఫాగింగ్ చేశారు. ఇటీవల కురిసిన చిరు జల్లులకు దోమలు వృద్ధి చెందాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దోమకాటుతో వ్యాపించకుండా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ పొగను వీధుల్లో కొట్టారు.

కౌలు రైతులంతా కౌలు కార్డులు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు

మద్దిపాడు: జిల్లాలోని కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని రాచవారిపాలెంలో కౌలు రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కౌలు రైతులు కార్డులు తీసుకోవడం వలన వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందడానికి, ఐదుగురు కలిసి గ్రూపులుగా ఏర్పడితే వారికి బ్యాంకుల ద్వారా పంట రుణాలకు సంబంధించిన లోన్లు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏడీఏ బీ రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రైతులు, రబీ సీజన్‌లో సాగు చేసే రైతులు అందరూ కౌలు కార్డులు పొందాలని సన్న చిన్నకారు రైతులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన కౌలు రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు పొందవచ్చని అన్నారు. అనంతరం పది మంది రైతులకు కౌలు కార్డులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమేష్, ఏఈఓ శేషయ్య, వీఏఏ చాందిని గ్రామ రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతుకు కార్డు అందిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావుతో ఏడీఏ బి. రమేష్ బాబు ఇతర అధికారులు

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్ క్రీడా పోటీలు


శిక్షా సప్తాహ్ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఎస్ఏ ఏఎంఓ రమేష్


చీమకుర్తి జెడ్పీ బాలికల హైస్కూలులో కబడ్డీ ఆడుతున్న బాలికలు

చీమకుర్తి: శిక్షా సప్తాహ్ క్రీడా పోటీల్లో భాగంగా చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక గ్రామీణ క్రీడా పోటీలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలను బుధవారం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో ఎస్ఎస్ఏ ఏఎంఓ రమేష్ ప్రారంభించారు.

వరిలో కొత్త రకాలతో అధిక దిగుబడులు

దర్శి: వరిలో కొత్త రకాలు వేసుకుంటే అగ్గితెగులు దోమ పోటును తట్టుకుని అధిక దిగుబడులు సాధించ వచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ బి.రమేష్ తెలిపారు. స్థానిక కేవీకేలో షెడ్యూల్ కులాలు, రైతులకు వరి, మిరప పంటలో పాటించాల్సిన ముఖ్యమైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే దిశలో పంటలు వేసుకోవాలన్నారు. వరిలో డ్రమ్ సీడ్ పద్ధతి ద్వారా నాటుకుంటే 30 శాతం వరకు ఖర్చు తగ్గించుకోవడమేగాక ఆరోగ్యకర అధిక పిలకలు కలిగిన మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ మిరప పంటలో రకాలు ఎంపిక, సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు. బీఏఐఎఫ్ సంస్థ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ చేయూత

ఒంగోలు సెంట్రల్: పేద విద్యార్థి గీతాంజలికి నీట్ కోచింగ్‌కు అయ్యే ఖర్చును అందించి సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ చేయూత ఇచ్చింది. విద్యార్థి గీతాంజలి తండ్రి విద్యుదాఘాతంతో మృతి చెందగా, తల్లి కుట్టుమిషన్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. విద్యార్థి గీతాంజలి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి నీట్ కోచింగ్ తీసుకుంటూ ఆర్థిక చేయూత కోసం ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాషను సంప్రదించారు. స్పందించిన దాత సహకారంతో రూ. 30వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డురాకూడదని ఎందరో విద్యార్థులను సూర్యశ్రీ ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. ట్రస్టు సెక్రటరీ సర్దార్ బాష మాట్లాడుతూ పేద విద్యార్థులు మంచి మార్కులతో చదువుకుంటే ఉన్నత చదువులకు తప్పకుండా ట్రస్ట్ తరుపున ఆర్థికసాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహనరావు, ది సేవ్ యానిమల్ ఫౌండేషన్ నిర్వాహకురాలు దివ్య, తాటిపర్తి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


విద్యుత్ గోపురంపై కనకదుర్గమ్మ తల్లి




ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు

కొత్తపట్నం: నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 45 రోజుల ఘటం గ్రామాల్లో తిరిగి బుధవారం నిలుపదల చేశారు. వంశపారంపర్య ధర్మకర్త గౌరవరపు కోటిరెడ్డి ఇంటి దగ్గర నుంచి సంప్రదాయకంగా పసుపు కుంకుమ మేళతాళాలతో ఊరేగింపుగా నాంచారమ్మ తల్లి ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ముందు కలశస్థాపన, కుంకమపూజ చేశారు. అమ్మవారికి కోడూరి మోహన్ రెండు గొడుగులు కొత్తవి చేయించి ఇంటి దగ్గర నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కామధేనువు వాహనాన్ని కాళహస్తి నరసింహ, చిన్న వారు సొంత నిధులతో నూతనంగా చేయించారు. రాత్రి పులి వాహనంపై శంభునిరెడ్డిపాలెంలో నాంచారమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి నీటి బిద్దెలతో నీరు పోసి టెంకాయలతో హారతులిచ్చారు. ఆలయం ముందు, ఆర్చి దగ్గర, గ్రామంలో ప్రధాన కూడళ్లల్లో విద్యుత్ దీపాలతో కటౌట్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించారు. కొత్తపట్నం శంభునిరెడ్డిపాలెం వారిచే బొబ్బిలి రాయుడు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

తపాలా శాఖ పథకాలు వినియోగించుకోవాలి

దర్శి: పోస్టాఫీసుల్లో ఉన్న సేవింగ్స్ పథకాలు, బీమా పథకాలు, డిజిటల్ ఖాతాలు వంటి సౌకర్యాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం పోస్టల్ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో డాక్ చౌపాల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పథకాలు వివరాలు తెలుసుకోవడం కోసం తమ పరిధిలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం ప్రజలకు అన్నీ రకాలుగా పోస్టల్ సేవలు అందించడంలో సిబ్బంది చక్కగా పనిచేస్తున్నారని చెప్పారు. సహాయ సూపరింటెండెంట్ మదన్‌మోహన్, పొదిలి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మెయిల్ ఓవర్సర్ శ్రీనివాసులు, ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి పాల్గొన్నారు.

మానసిక స్థైర్యాన్ని నింపేందుకు క్రీడలు దోహదం


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

ఒంగోలు సెంట్రల్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, మానసిక స్థైర్యాన్ని నింపేందుకు క్రీడలు దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర అన్నారు. స్థానిక డీఆర్ఆర్ఎం పాఠశాలలో బుధవారం శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అనేక సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించి ఆటల ప్రాముఖ్యతను వక్తలు విద్యార్థులకు వివరించారు. డీసీఈబీ సెక్రటరీ, ఎంఈఓ రమేష్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ సురేష్, వెంకట రమణ, రాజ్యలక్ష్మి, పీడీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.







అడ్డు తొలగింది

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్లలో టీడీపీ కూటమి నేతలు అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎట్టకేలకు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయంగా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కార్పొరేషన్ అధికారులు వాటిని తొలగించారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తొలిగాయి.

- సాక్షి, ఒంగోలు



